సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం । 22 । నవంబర్ । 2023



ఫోర్జరీతో నిధులు స్వాహా - 10లో▸
మానుకోట మండలం ఇస్లావత్ తండా(ఎం) సర్పంచ్ నరేశ్ తన సంతకాన్ని ఫోర్జరీ చేసి టీఎస్ బీపాస్ నిధులు రూ.49వేలు స్వాహా చేశారని ఉప సర్పంచ్ రంగమ్మ తెలిపారు.



ముస్లిం సంక్షేమానికి పెద్దపీట
బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు.
- 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0° /22.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండతో పాటు పొడి వాతావరణం ఉంటుంది. సాయంత్రం తిరిగి చలి ప్రారంభం అవుతుంది.

న్యూస్‌రీల్

25న రేవంత్‌రెడ్డి రాక



భూపాలపల్లి రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 25వ తేదీ శనివారం జిల్లా కేంద్రానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రానున్నారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులు మంగళవారం సభాస్థలి కోసం భూపాలపల్లి పట్టణంలోని అంగడి స్థలాన్ని పరిశీలించారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు దేవన్, కౌన్సిలర్ ముంజాల రవీందర్, నాయకులు చల్లూరి సమ్మయ్య, బుర్ర కొమురయ్య, క్యాతరాజు సాంబమూర్తి, రాము తదితరులు ఉన్నారు.

గోదావరి హారతి సెట్ బహూకరణ



కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయానికి గోదావరి హారతి సెట్‌ను(జర్మన్ సిల్వర్) కూరపాటి కుమారస్వామి దంపతులు, కుసుమ జైపాల్‌లు మంగళవారం ఆలయ అధికారులు, ధర్మకర్తలకు అందజేశారు. నక్షత్ర హారతి 3, నాగ హారతి 3, ధూప హారతి 3, పీకాక్ వింజమార 3, శంక వింజమార 3లతో కలిపి 15సెట్స్ విలువ రూ.93వేల వరకు ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తిశర్మ, ధర్మకర్త రాంరెడ్డి, అడప సమ్మయ్యలు పాల్గొన్నారు.

ఓటును అమ్ముకోవద్దు



ఏటూరునాగారం: ఓటర్లు తమ ఓటును నోట్లకు అమ్ముకోవద్దని జిల్లా ఎస్వీఈఈపీ నోడల్ అధికారి, డీడబ్ల్యూఓ ప్రేమలత తెలిపారు. మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో మంగళవారం ఓటరు చైతన్య ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నూతనంగా ఓటు హక్కుకు అర్హత సాధించిన యువతీ యువకులు అర్హులైన అభ్యర్థులకు ఓట్లు వేసి నిజాయితీని చాటుకోవాలన్నారు. ఓటుహక్కు చాలా విలువైందని దాన్ని అమ్ముకోవడం సరికాదన్నారు. ఓటర్లు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. డబ్బులకు ఆశించకుండా అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. అనంతరం డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులతో పాటుగా ఇంటిచుట్టు పక్కల వారు ఓటును నిజాయితీగా వేసేలా చూడాలని సూచించారు. అవినీతి రహిత ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడే భవిష్యత్ బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న, జిల్లా ఎన్నికల ఐకాన్, పర్వతారోహకుడు వివేక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఘన్‌సింగ్, జిల్లా బాలల ప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ, సఖి లీగల్ అధికారి కర్నే ప్రణయ్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ సుదర్శన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం



మరిపెడలో జరిగిన డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి రెడ్యానాయక్

రెడ్యానాయక్ సీనియర్ నాయకుడు, నాకు మంచి సలహాదారు

- మళ్లీ గెలిపిస్తే మంచి హోదా కల్పిస్తా..
- గిరిజనుల కోరిక మేరకు తండాలను గ్రామ పంచాయతీలుగా చేశాం
- కాల్వలను చూసి కన్నీరు పెట్టుకున్న చోటే.. ధాన్యపురాశులు పండుతున్నాయి
- ఉద్యమ సమయంలో వీరన్నకు మొక్కి ముందుకెళ్లా..
- రాష్ట్రం సాధించాక స్వామికి కోరమీసం మొక్కు చెల్లించా
- డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

సాక్షి, మహబూబాబాద్/ మరిపెడ/ మరిపెడ రూరల్: 'యాడియో.. బాయియో.. బహెనో.. రాం ..రాం' అందరూ బాగుండాలి. మంచి పాలన అందాలంటే తెలంగాణను పోరాడి సాధించుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలి. బీఆర్ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యం' అని బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడలో జరిగిన డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. ఏళ్లుగా గిరిజనులు తమ తండాలో తమరాజ్యం కావాలని ఆకాంక్షించారని, గత పాలకులు పట్టించుకోలేదని, బీఆర్ఎస్ పాలనలో 3500 తండాలను పంచాయతీలుగా ప్రకటించామన్నారు. డోర్నకల్ నియోజకర్గంలోని 82 తండాల్లో గిరిజనులే పాలన సాగిస్తున్నారన్నారు. తన గురించి, పైరవీల గురించి ఆలోచించకుండా ప్రజల కోసమే పని చేసే రెడ్యానాయక్ వంటి నాయకుడు పాలించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. సీనియర్ నాయకుడిగా ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. నాకు మంచి సలహాదారుడిగా ఉంటున్న రెడ్యానాయక్‌ను మళ్లీ గెలిపించాలని, నూతన ప్రభుత్వంలో మంచి హోదా కల్పించే బాధ్యత నాదని కేసీఆర్ ప్రకటించారు.

కురవి వీరభద్రుడు పవర్‌ఫుల్..

నియోజకవర్గంలోని కురవి వీరభద్రుడు పవర్‌ఫుల్ దేవుడు అని కేసీఆర్ అన్నారు. ఉద్యమ సమయంలో వీరన్నకు మొక్కి ముందుకెళ్లానని, తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత బంగారు కోరమీసం చెల్లించి మొక్కులు తీర్చుకున్నానని గుర్తుచేశారు. దేవుడే కాదు.. ఈ ప్రాంత ప్రజలు కూడా మంచి చైతన్యవంతులు అన్నారు. ఇదే చైతన్యంతో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు.

కాల్వలతో ధాన్యం రాశులు

గత పాలకులు కాల్వలు తవ్వారు. కానీ ఏనాడూ చుక్కనీరు పారించలేదని కేసీఆర్ అన్నారు. వెన్నవరం కాల్వకు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ పట్టుపట్టి సాగునీరు వచ్చేలా కృషి చేశారని పేర్కొన్నారు. దీంతో నాడు నీళ్లు లేక కాల్వలను చూస్తే కన్నీరు వచ్చేదని, ఇప్పుడు నిండా పారుతున్న కాల్వలతో ధాన్యపురాశులు పండుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నిర్మించిన ప్రాజెక్టులతో రాష్ట్రంలో 3కోట్ల టన్నుల ధాన్యం పండుతుందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటే ధాన్యం ఉత్పత్తి 4కోట్ల టన్నులకు చేరుతుందని వివరించారు. సభలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సీనియర్ నాయకులు నూకల నరేశ్‌రెడ్డి, రామసహాయం రంగారెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, డీఎస్ రవిచంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ సింధూర, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, వేణుగోపాల్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, అయూబ్ పాషా, చాపల యాదగిరిరెడ్డి, మహేందర్‌రెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 3:30 గంటలకు: సభ ప్రాంగణానికి చేరుకున్న సీఎం హెలికాప్టర్.. వేదిక చుట్టూ ఒక రౌండ్ చక్కర్లు.
- 3:37 గంటలకు : హెలికాప్టర్ ల్యాండింగ్
- 3:43 గంటలకు : హెలిపాడ్ నుంచి బస్సులో వేదిక వద్దకు..
- 3:49 గంటలకు : సీఎం ప్రసంగం ప్రారంభం
- 4:09 గంటలకు : ప్రసంగం ముగింపు
- 4:16 గంటలకు : హెలికాప్టర్‌లో సీఎం సూర్యాపేట వైపు పయనం..

ఉర్రూతలూగించిన గులాబీల జెండలు పాట

ఏపూరి సోమన్న కళా బృందం సభ్యులు పాటలు పాడుతూ సభికులను ఉత్సాహపరిచారు. గులాబీల జెండల పాటకు స్టేజీపై ఉన్న మంత్రి సత్యవతి రాథోడ్, మానుకోట ఎంపీ మాలోతు కవిత, మహిళా ప్రజాప్రతినిధులు నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సభ ముగియడంతో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మళ్లీ గెలిపిస్తే మరింత సేవ చేస్తా: రెడ్యానాయక్



ఇంతకాలం ప్రజల దీవెనలు, ఆశీస్సులతో డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, మళ్లీ గెలిపిస్తే మరింత సేవ చేస్తానని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మరిపెడలో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించుకున్నామని చెప్పారు. మళ్లీ మన ప్రభుత్వం రాగానే మరిపెడ రెవెన్యూ డివిజన్, డోర్నకల్‌లో 100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించుకుందామన్నారు. మాకుల వేంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.5కోట్లు, నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.

అసాంఘిక శక్తులకు చోటివ్వొద్దు
డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కాటారం: గ్రామాల్లో అసాంఘిక శక్తులకు చోటివ్వొద్దని కాటారం డీఎస్పీ గద్దం రామ్మోహన్ రెడ్డి అన్నారు. కాటారం మండలం ప్రతాపగిరిలో మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కాసో ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామస్తులతో డీఎస్పీ సమావేశమై పలు అంశాలపై చర్చించి సూచనలు చేశారు. గ్రామంలో అనుమానితులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని తెలిపారు. కాలం చెల్లిన మావోల సిద్ధాంతాలకు ఆకర్షితులు కావొద్దని సూచించారు. యువత చెడు వ్యసనాలు, అల్లర్లకు దూరంగా ఉండాలని కేసుల పాలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణకు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రంజిత్‌రావు, ఎస్సై అభినవ్, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

భూపాలపల్లి అర్బన్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. చిన్న తగాదాలను పెద్దవిగా చేసుకొని ప్రజలు వారి జీవితాలతో వారే ఆడుకుంటున్నారని పేర్కొన్నారు. రాజీమార్గాన్ని ఎంచుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బులు ఆదా అవుతాయని తెలిపారు. భార్యాభర్తల మధ్య వచ్చే తగాదాలను పెద్దవి చేసుకోకూడదని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో అదనపు బ్యాలెట్ యూనిట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భూపాలపల్లి నియోజకవర్గానికి సంబంధించిన 396 అదనపు బ్యాలెట్ యూనిట్లు ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్ వేర్ వినియోగిస్తూ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. అనంతరం భూపాలపల్లి నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఈవీఎం గోదాం భద్రతను పరిశీలించినారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని, బాధ్యతాయుతంగా సిబ్బంది సమన్వయంతో నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల విధులపై మాస్టర్ ట్రైనర్స్ చే నిర్వహించిన 2వ లెవెల్ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొన్నారు. పీపీటీ ద్వారా శిక్షణ తరగతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓటింగ్ ప్రారంభంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మాక్ పోలింగ్ నిర్వహించే విధానంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత పోలింగ్ అధికారులు ఫామ్ 22ను క్షుణ్ణంగా ఒకటికి 10 సార్లు చదివి తప్పులు లేకుండా సరిచూసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ పొందే అధికారులు, సందేహాలు ఉంటే మరోసారి అవగాహన కల్పిస్తామన్నారు. ఎవరూ కూడా విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు.

వేగులతో సమాచార సేకరణ!

ప్రత్యర్థుల కదలికలు, ప్రచార సరళిపై ఆరా...

- ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్‌లో సమాచారం
- జంపింగ్ జపాంగ్‌లపై ఆరా.. అనుమానం వస్తే నిఘా
- అసంతృప్తుల వివరాలు సేకరణ... పార్టీలో చేర్చుకునేందుకు మంతనాలు
- కేడర్‌ను బట్టి రేటు ఫిక్స్.. అభ్యర్థుల ఆమోదంతో చేరికలు
- ఉమ్మడి వరంగల్‌లో చాపకింది నీరులా పనిచేస్తున్న వైనం



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల సమరానికి తెరపడేందుకు మరో ఎనిమిది రోజులే సమయం ఉంది. అంతకు రెండు రోజుల ముందే ప్రచారఘట్టం ముగియనుంది. ఈ నెల 30న పోలింగ్ జరగనుండగా అభ్యర్థుల గెలుపో.. ఓటమో డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు తర్వాత తేలనుంది. ఈ నేపథ్యంలో ఓ వైపు ప్రచారాన్ని హోరెత్తిస్తూనే.. మరోవైపు ప్రత్యర్థుల కదలికలను కనిపెట్టేందుకు అభ్యర్థులు 'వేగుల'ను నియమించుకున్నారు. ఒకరిని చూసి ఒకరు ఒక్కో నియోజకవర్గంలో సుమారు 150 నుంచి 200 మందిని నియమించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందడం కోసం అస్త్రశస్త్రాలను సంధిస్తున్న అభ్యర్థులు.. రోజూవారీగా రాత్రి 9 నుంచి 10.30 గంటలలోపు వేగులు ఇచ్చే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని మరుసటి రోజు ఎదురుదాడికి సిద్ధమవుతున్నారు.

ప్రత్యర్థుల కదలికలు, ప్రచారసరళిపై దృష్టి....


పార్టీలో చురుకైన నాయకులు, కార్యకర్తలతోపాటు డిగ్రీ, పీజీ పూర్తయిన విద్యార్థులను వేగులుగా ఉపయోగించుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీకి సంబంధించి టీఆర్ఎస్వీ, యూత్ విభాగం కార్యకర్తలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పరిస్థితిని అంచనా వేసి అభ్యర్థులకు చేరవేస్తున్నారు. పోటీ పార్టీల అభ్యర్థుల ప్రసంగాలకు సంబంధించిన వీడియోలు, జన సమీకరణ ఫొటోలు వాట్సాప్ ద్వారా షేర్ చేస్తున్నారు. మరోవైపు ఇంటెలిజెన్స్ వర్గాలు కూడ అభ్యర్థుల ప్రచార సరళి,ప్రజల నుంచి వస్తున్న స్పందనతోపాటు నిరసనలు,నిలదీతలను రిపోర్టు చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులకు మద్దతుగా ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో తిరుగుతూ సర్వే బృందాల పేరిట వివరాలు సేకరిస్తున్నారు. ఇటీవల పరకాల, ములుగు,జనగామ,వరంగల్ తూర్పు,భూపాలపల్లి, డోర్నకల్ తదితర నియోజకవర్గాల్లో ఈబృందాలు తిరిగి పార్టీ హైకమాండ్‌కు నివేదిక కూడా ఇచ్చినట్లు చెబుతున్నారు. బీజేపీ అభ్యర్థుల ప్రచారసరళిపై ఆ పార్టీ సీనియర్‌లు బృందాలుగా ఏర్పడి ఒక జిల్లాకు చెందిన వారు మరో జిల్లాలో తిరుగుతున్నారు. ఆర్ఎస్ఎస్ వర్గాలుకూడా అభ్యర్థుల కదలికలు, ప్రచారసరళిని గమనించడంతోపాటు.. వారు ఓటర్లను ఏ మేరకు ప్రభావితం చేస్తున్నారో కూడా అంచనా వేసి తగు సూచనలు చేస్తున్నట్లు సమాచారం.

ఒకరిపై ఒకరు.. కోవర్టులు, అసంతృప్తులపై ఆరా..

అభ్యర్థుల కోసం పనిచేస్తున్న వేగులు పార్టీలో కార్యకర్తలుగా ఉంటూనే కోవర్టులుగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించే పనిలోనూ ఉన్నారు. పార్టీలు మారే ఆలోచనలో ఉన్న వారిని సైతం గుర్తిస్తున్నారు. పొద్దంతా పార్టీ అభ్యర్థితో ఉంటూనే రాత్రివేళల్లో పోటీ అభ్యర్థులు, వారి అనుచరులతో 'సిట్టింగ్'వేసి గుట్టు విప్పుతున్న వారినీ గుర్తిస్తున్నారు. ఇలా గుర్తించిన వారిని అభ్యర్థులు మందలించడంతో పార్టీలు మారిన వారు కూడా ఉన్నారు. ఇటీవల గ్రేటర్ వరంగల్‌లో ఓ కీలక నేత, ఇద్దరు కార్పొరేటర్లు పార్టీలు మారారు కూడా. అంతకు ముందు పరకాల, భూపాలపల్లి, డోర్నకల్, జనగామ నియోజకవర్గాల్లో కూడా పార్టీలు పరిస్థితి ఉంది. అదేవిధంగా పార్టీలో ఉంటూ అసంతృప్తితో రగిలిపోయే వారిని గుర్తించి జాబితాను కూడా తయారు చేసి అభ్యర్థులకు అందజేస్తుండగా... ఆ మరుసటి రోజే అసంతృప్తులను కలిసి బుజ్జగించి వెంట తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీలో గూఢాచారులను నియమించుకుని ఎప్పటికప్పుడు కోవర్టులు, అసంతృప్తులను నివారించడంలో సఫలమవుతున్న అన్ని పార్టీల అభ్యర్థులు మరో పది రోజులు ఈ వ్యవస్థను కొనసాగించనున్నారు. అభ్యర్థులకు చాపకిందినీరులా పనిచేస్తున్న వేగుల వ్యవస్థ.. ప్రభుత్వాలకు 'ఇంటెలిజెన్స్'ల ఉపయోగపడుతోందన్న చర్చ జరుగుతోంది.

- బీఆర్ఎస్ వస్తే తెలంగాణ క్షేమం.. సంక్షేమం
- తొమ్మిదిన్నరేళ్లలో ఎంతోఅభివృద్ధి చేశాం
- 'సాక్షి'తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

ప్రజలే నా బలం.. బలగం



సాక్షి, పెద్దపల్లి: 'గతంలో ఎన్నడూ లేనివిధంగా మంథని నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ ప్రతీగడపకు చేరాయి. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ ప్రజారంజక పాలనను ప్రజలు గమనించారు. అందుకే నాకు ప్రచారంలో బ్రహ్మరథం పడుతున్నారు. నా విజయానికి బీఆర్ఎస్ చేసిన సంక్షేమం, అభివృద్ధే దోహదం చేస్తుంది' అని మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మంథనిలో నా ఇల్లు...

ప్రజలు నన్ను 2014లో గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిత్యం వారికి అందుబాటులో ఉంటున్నా. నియోజకవర్గంలో ఏదోఒక గ్రామంలో ఉంటాననే పేరు తెచ్చుకున్నా. పూర్వ ఏ ఎమ్మెల్యేలు కూడా నాలాగా ప్రజలమధ్యలో లేరు. ప్రజలే నాబలం.. నాబలగం. ఇక్కడే పుట్టా, ఇక్కడే పెరిగా.. ఇక్కడే చస్తానని గోదారమ్మ సాక్షిగా ప్రమాణం చేసి చెప్పుతున్నా.

బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వండి

మంథనిలో ఒకేకుటుంబం 7సార్లు, కాంగ్రెస్ 45 ఏళ్లుగా పాలించాయి. వారు చేయలేని అభివృద్ధిని కేవలం తొమ్మిదిన్నరేళ్లల్లోనే చేసి చూపెట్టాం. ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ప్రతీ ఇంటికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించా. అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. బీసీ బిడ్డను ఈసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ, మా పార్టీలో బీసీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా పోటీచేస్తారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ఎమ్మెల్యేగా రూ.1,100కోట్లతో అభివృద్ధి చేశా. ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు ఏం చేశారో ప్రజలకు చెప్పాలి. ఎవరి హయాంలో ఏంచేశారో మంథని సెంటర్‌లో చర్చకు నేను సిద్ధం. డబ్బుకట్టలతో, మాయ మాటలతో గెలిచాక హైదరాబాద్‌కు పోయేవాడిని కాదు. గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉంటా.

రూ.1,000కోట్లతో అభివృద్ధి చేస్తా

2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాక సుమారు రూ.1,100కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశాను. రింగ్‌రోడ్డు పూర్తిచేశా. ముత్తారం, ఓడేడ్, ఖమ్మంపల్లి బొక్కలవాగుపై వంతెనలు నిర్మించా. పుట్ట లింగమ్మ ట్రస్ట్ ద్వారా ఉచిత వివాహాలు, సేవకార్యక్రమాలు చేశా. నన్ను మరోసారి గెలిపిస్తే సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.1,000కోట్ల ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చి మంథని రూపురేఖలు మార్చుతా. అలాగే హైదరాబాద్‌లో చదువుకునే పిల్లలకు నా సొంత పైసలతో ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తాం. గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేదవారికి ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం చేస్తా.

బ్రహ్మరథం పడుతున్నారు

కాంగ్రెస్ అమలు చేయని సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రవేశపెట్టారు. వాటి లబ్ధిదారులు ఎంతోమంది ఉన్నారు. నేను ప్రచారానికి వెళ్తే వారందరూ బ్రహ్మరథం పడుతున్నారు. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్ల లబ్ధిదారులు పెద్దకొడుకులా చూస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి.

త్వరితగతిన సీఎంఆర్ రవాణా పూర్తి చేయాలి

వరంగల్: వానాకాలం, యాసంగి 2022–23 సీఎంఆర్ రవాణాను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం సీఎంఆర్ రవాణాపై అధికారులతో వరంగల్ కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధి కమలాపురం, ఇల్లంద ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం 2023–24 ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు. సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలను ఓపీఎంఎస్‌లో చేయాలన్నారు. ఏనుమాములలోని గోదాంలను, ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు.

ఇరువర్గాల ఘర్షణ

మహాముత్తారం: ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ మంథని నియోజకవర్గంలో రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. మారుమూల ప్రాంతంలో ప్రచారానికి వెళ్లిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరస్పరం దాడులు చేసుకున్న సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు నల్లగుంట మీనాజీపేట గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టాపూర్‌లో ప్రచారం చేపట్టారు. ప్రచారం పూర్తయిన అనంతరం తిరిగి వస్తున్న క్రమంలో కిష్టాపూర్ గ్రామ సమీపంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఈ పరస్పర దాడుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంథని ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన సర్పంచ్ సిరికొండ బక్కారావుకు తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా మహాముత్తారం మాజీ జెడ్పీటీసీ బీఆర్ఎస్ నాయకుడు మందల రాజిరెడ్డికి సైతం గాయాలైనట్లు తెలిసింది. ఈ దాడుల్లో కాంగ్రెస్ నాయకుడు బక్కారావు కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. బక్కారావుపై దాడి నేపథ్యంలో కార్యకర్తలు మీనాజీపేటకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పోలీసులు ఆందోళనకారులను సముదాయించారు.



గాయపడ్డ సిరికొండ బక్కారావు



స్పృహకోల్పోయిన రాజిరెడ్డి

ముస్లింల సంక్షేమానికి బీఆర్‌ఎస్ పెద్దపీట

- హోం మంత్రి మహమూద్ అలీ


మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

భూపాలపల్లి అర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట వేసిందని, కాంగ్రెస్ పార్టీ చేసిందేమి లేదని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హోం మంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మైనారిటీలకు చేసింది ఏమీలేదని, ముస్లింలు అంటే ఓల్డ్ సిటీ అని ముద్ర వేసిన పార్టీలను పక్కన పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముస్లిం సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. మైనారిటీ విద్యార్థుల చదువుకు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ముస్లిం కుటుంబాలలో తాను సోదరుడిలా ఉన్నానని, జిల్లా కేంద్రంలో ఈద్గా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 5 ఎకరాల్లో మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించామన్నారు. షాదీఖానా కోసం రానున్న రోజుల్లో ఎకరం స్థలం కేటాయిస్తామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, నాయకులు ఖరీముల్లా, ఇర్ఫాన్, రమేశ్, రాజ్‌మహ్మద్, జనార్దన్ పాల్గొన్నారు.

ఓరుగల్లు కీర్తిని చాటాలి..


సమావేశంలో కేంద్ర పురావస్తుశాఖ అధికారి మల్లేశం, చరిత్రకారుడు గణపతి, విద్యార్థులు

- చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాలి
- ప్రముఖ చరిత్రకారుడు రాచర్ల గణపతి

ఖిలా వరంగల్: చారిత్రక కాకతీయుల రాజధాని ఓరుగల్లు కీర్తిని ప్రపంచానికి చాటాలని ప్రముఖ చరిత్రకారుడు రాచర్ల గణపతి అన్నారు. శిల్పాల ప్రాంగణంతోపాటు పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు జరుగుతున్న వారసత్వ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఖిలా వరంగల్ మధ్యకోటలోని శిల్పాల ప్రాంగణంలో కేంద్ర పురావస్తుశాఖ అదీక్షకురాలు స్మిత ఎస్ కుమారి ఆధ్వర్యంలో జిల్లా అధికారి మడిపల్లి మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాకతీయుల విశిష్టత, చారిత్రకకట్టడాల పరిరక్షణపై ఆయన మాట్లాడారు. చారిత్రక కట్టడాల పరిరక్షణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంటుందన్నారు. పర్యాటకులు పర్యాటక ప్రదేశాల తినుభండారాలు డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలన్నారు. శిల్పకళా సంపదను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన అవసరం మనపై ఉందన్నారు. కార్యక్రమంలో సూర్య కిరణ్, ఏడీ మల్లునాయక్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ ముచ్చటెరికేనా ?

పోలింగ్ ఏజెంట్ల నియామకం ఇలా..

కాజీపేట: ఎన్నికల్లో అభ్యర్థుల పక్షాన పోలింగ్ స్టేషన్‌లో ఉండే ఏజెంట్ల పాత్ర కీలకం. అభ్యర్థి లేదా ఆయన అనుమతి పొందిన వ్యక్తి ఏజెంట్ అయ్యే వారు ధ్రువపత్రం తీసుకోవాలి. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభం అవుతుంది. ఏజెంట్లుగా ఉన్న వారు ఉదయం 6 గంటలకే పోలింగ్ బూత్‌కు వచ్చి అభ్యర్థి ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు, ప్రొసైడింగ్ ఆఫీసర్‌కు ఇవ్వాలి. ఆయన ఏజెంట్లను నియమిస్తారు. ఇలా పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి పక్షాన ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో ఇద్దరేసి అభ్యర్థులు ఉంటారు. పోలింగ్ స్టేషన్‌లో ఒక అభ్యర్థికి ఒక ఏజెంట్ మాత్రమే ఉండాలి. ఆయన భోజనం లేదా ఇతర అవసరాలపై బయటకు వెళ్లినప్పుడు మాత్రమే రెండో/ఏజెంట్‌ను అనుమతిస్తారు. ఓటు వేసేందుకు వచ్చే వారిని అసలైన ఓటరో కాదో అభ్యర్థి పక్షాన ఉన్న ఏజెంట్లు గుర్తించాల్సి ఉంటుంది.

ఎస్సై గారూ.. ఇదేం 'చట్టం'?

మైనర్‌ను వివాహం చేసుకున్న ముప్పై ఏళ్ల వ్యక్తి

- ఆపై రక్షణ కోసం చెన్నారావుపేట పోలీసుల చెంతకు..
- తమ పాప మైనర్ అని తల్లిదండ్రులు చెప్పినా నిర్లక్ష్యం
- ఆధార్ కార్డు, ఆసుపత్రి డిశ్చార్జ్ కార్డు చూపించినా జాన్తానై..
- స్టడీ సర్టిఫికెట్ తీసుకొని వస్తే చూద్దామంటూ దాటవేత
- అయినా ఆ వ్యక్తితోనే బాలికను పంపిన అధికారి
- సర్టిఫికెట్ తీసుకొచ్చినా కనిపించని బాలిక ఆచూకీ



సాక్షి, వరంగల్: మైనర్‌ను పెళ్లి చేసుకుని భద్రత కోసం వచ్చిన ఓ వ్యక్తికి వరంగల్ పోలీసు కమిషనరేట్ పోలీసులు అనుకూలంగా వ్యవహరించడం సంచలనంగా మారింది. పుట్టిన తేదీకి ఆధార్ కార్డు ఆధారం కాదంటూ సుప్రీంకోర్టు చెప్పినా అదే ఆధార్ కార్డును ఆసరా చేసుకుని సదరు బాలికను మేజర్‌గా గుర్తించి మరీ అతడి వెంట పంపడం పోలీసుల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. మహిళల భద్రత విషయంలో ఎక్కడా తగ్గేదే లేదని ఓవైపు ప్రభుత్వం చెబుతుంటే.. అందుకు విభిన్నంగా చెన్నారావుపేట పోలీసులు అది కూడా స్టేషన్ హౌస్ ఆఫీసర్ వ్యవహరిస్తున్నారు. కనీసం బాధితురాలి తల్లిదండ్రుల మాటలు పట్టించుకోకపోవడం తెరవెనుక ఏం జరిగి ఉంటుందనే చర్చ జోరుగా జరుగుతోంది. పాపను తమ వెంట పంపకుండా.. ఎక్కడ భద్రత కల్పిస్తారంటే సదరు ఎస్సై కనీస సమాధానం ఇవ్వకపోవడంతో మంగళవారం రాత్రంతా ఆ తల్లిదండ్రులకు జాగారం చేస్తూ బోరున విలపించారు.

అన్ని ధ్రువపత్రాలు సమర్పించినా ససేమిరా..

దాదాపు 30 ఏళ్లున్న వ్యక్తితో బాలికకు వివాహం జరిగితే వాస్తవం తెలుసుకోకుండా సదరు పోలీసు అధికారి ఏకపక్షంగా వ్యవహరించడంతో బాలికల భద్రత చట్టం సరిగా అమలు అవుతుందా? లేదా అనే చర్చ జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక(15)కు 30 ఏళ్ల వ్యక్తి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రక్షణ కల్పించాలని కోరారు. ఆ వెంటనే బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందడంతో ఠాణాకు వెళ్లి తమ పాప బాలిక అని తెలిపారు. దీనికి ఆధారంగా ఆధార్ కార్డు చూపించినా అదీ చెల్లదన్నారు. బాలిక పుట్టిన తేదీ, బాలిక జన్మించినప్పటి దవాఖాన డిశ్చార్జ్ కార్డు చూపించినా సదరు అధికారి తిరస్కరించారు. బాలిక చదివిన పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్ తీసుకు రమ్మని చెప్పగా 'రాత్రి అయిందా కదా సార్ రేపు తీసుకొస్తాం. పాపను మాతో పంపించండన్నా' స్పందించలేదు. ఆ తర్వాత తల్లిదండ్రులను అక్కడి నుంచి పంపిన అనంతరం బాలికను ఆ వ్యక్తితోనే పంపించారు. మంగళవారం సాయంత్రం వరకూ బాలిక ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నిబంధనలు ఏంటీ..

బాలల న్యాయ చట్ట ప్రకారం.. 18 సంవత్సరాలు లోపు బాలల విషయాలు పోలీసుల దృష్టికి వస్తే వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ హెల్ప్ లైన్, బాలల సంరక్షణ విభాగాలకు సమాచారం అందించాలి. సదరు అధికారులు బాలుడు లేదా బాలిక స్థితిగతులు తెలుసుకుని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచి వారి ఆదేశాలకు అనుకూలంగా వ్యవహరిస్తారు. కానీ ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు. పోలీసులు ఏకంగా పెళ్లి చేసుకున్న వ్యక్తి వెంట సదరు బాలికను పంపించడం తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. సీడబ్ల్యూసీ ముందుకువస్తే ఆ బాలికతో మాట్లాడి సఖి కేంద్రానికి పంపి కౌన్సెలింగ్ ఇస్తారు. లేదంటే తల్లిదండ్రులతోని వెళ్తానంటే పంపిస్తారు. అయితే ఇక్కడ అవేమీ జరగకుండా పోలీసులు నిర్ణయం తీసుకుని బాలికను ఆ వ్యక్తితో పంపడంతో ఆమె పరిస్థితి ఎలా ఉందనే టెన్షన్ తల్లిదండ్రుల్లో నెలకొని ఉంది.

విచారణ చేపట్టిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ..



ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు పోలీసులను కలిసి వచ్చిన అనంతరం మండల స్థాయి ఐసీడీఎస్ అధికారులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం అందించగా వారు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. సదరు బాలికకు 15 సంవత్సరాలు మాత్రమే ఉండగా, చట్ట విరుద్ధంగా వ్యక్తి పెళ్లి చేసుకున్నాడని, బాలిక ఆచూకీ సైతం లేదని సీడబ్ల్యూసీ కమిటీని ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. కాగా, బాలల న్యాయ చట్టాలను ఉల్లంఘించిన సదరు పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాలల హక్కుల కార్యకర్తలు కోరుతున్నారు.

గీత కార్మికులకు ఐదు గ్యారంటీలు ఇవ్వాలి


నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

- మేకపోతుల వెంకటరమణ

కాజీపేట అర్బన్: రాజకీయ పార్టీలు గీత కార్మికులకు ఐదు గ్యారంటీలను ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. 31వ డివిజన్‌లోని గౌడ హాస్టల్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కల్లుగీత కార్మిక సంఘం 66వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా కేజీకేఎస్ వెంకటరమణ మాట్లాడారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం రాజకీయ పార్టీలు గీతకార్మికులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నారని అన్నారు. గీత కార్మికులకు వృత్తిలో ప్రమాద నివారణకు చర్యలు, సేఫ్టీ మోకులు, ద్విచక్రవాహనాలు, బీమా సౌకర్యం, రూ.లక్ష ఆర్థిక సాయం, వంద కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయింపు వంటి ఐదు గ్యారంటీలను అమలు చేసుకునేందుకు ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్, బొనగాని యాదగిరి, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, గాని సాంబయ్య, సుధాకర్, శ్రీనివాస్, గంగాధర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- బంగారు, వెండి నగలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు

కాజీపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో రూ.2లక్షల విలువ చేసే బంగారు, వెండి నగలు, నగదును అపహరించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాజీపేట 47వ డివిజన్ భవానీనగర్ కాలనీకి చెందిన కల్లెపు గాయత్రి ఈ నెల 10వ తేదీన ఇంటికి తాళం వేసి తన భర్త రమేష్‌కు వైద్యం చేయించడం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. హాస్పిటల్‌లో ఆలస్యం కావడంతో రాత్రి వేళ బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వెళ్లగా తాళం పగులగొట్టి ఉండటమే గాక ఇంట్లోని బంగారు, వెండి నగలు, నగదు రూ.2,41,400 కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కాజీపేట క్రైం పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపి సోదాలు నిర్వహించగా గాయత్రి ఇంటిలో చోరీకి పాల్పడిన వస్తువులు లభించాయి. ఎండీ యాకుబ్ పాషా(ఎస్‌ఆర్ నగర్, ఏనుమాముల), ఎండీ మహమూద్ (చింతల్, వరంగల్)కు చెందిన వీరు చోరీ సొత్తును హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లుగా ఒప్పుకోవడంతో సొత్తుతోపాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. చోరీ జరిగిన నాలుగు రోజుల్లో నిందితులను పట్టుకున్న సిబ్బందిని డీసీపీ ఎంఏ బారి, ఏసీపీ డేవిడ్ రాజ్ అభినందించారు. సమావేశంలో ఎస్సైలు లలిత, నర్సింగరావు, హెడ్ కానిస్టేబుల్ వాల్యానాయక్, కానిస్టేబుల్స్ భాస్కర్, విష్ణు, శ్రీనివాస్, వేణు, రమేష్, సతీస్ రెడ్డి పాల్గొన్నారు.

ఫోర్జరీతో టీఎస్ బీపాస్ నిధులు స్వాహా

- ఇస్లావత్ తండా(ఎం) జీపీలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని ఇస్లావత్ తండా (ఎం) గ్రామపంచాయతీ సర్పంచ్ ఇస్లావత్ నరేశ్ తన సంతకాన్ని ఫోర్జరీ చేసి సంయుక్త బ్యాంకు ఖాతా నుంచి టీఎస్ బీపాస్ నిధులు రూ.49 వేలు స్వాహా చేశారని ఉప సర్పంచ్ ఇస్లావత్ రంగమ్మ అన్నారు. తమ ఇద్దరి పేరు మీద సంయక్తంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మానుకోట బ్రాంచ్‌లో టీఎస్ బీపాస్ అకౌంట్ ఓపెన్ చేశామన్నారు. అయితే సదరు ఖాతా నుంచి సర్పంచ్ నరేష్ ఈ నెల 16వ తేదీన జీపీ కార్యదర్శికి కూడా తెలియకుండా టీఎస్ బీపాస్ నిధులు రూ.49 వేలు డ్రా చేశారన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ ప్రమేయం లేకుండా, సంతకం లేకుండా డబ్బులు డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై ఎంపీడీఓ, ఎంపీఓ, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హసన్‌పర్తి: నగరంలోని గోపాల్‌పూర్‌లో పేకాట కేంద్రంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. ఇందులో దేవన్నపేటకు చెందిన వేమన్నరెడ్డి, మహేందర్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి, గోపాల్‌పూర్‌కు చెందిన సుమన్, ఉమాశంకర్‌రెడ్డి, రాంచందర్‌ను అరెస్టు చేసి రూ.45,520 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌తెలిపారు.

మత్స్యరంగానికి ఉజ్వల భవిష్యత్

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజన్న


రైతు కుమారస్వామిని సన్మానిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కరీమాబాద్: మత్స్యరంగానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజన్న అన్నారు. మామునూరు కేవీకేలో మంగళవారం ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు చేపల పెంపకం కూడా చేపట్టొచ్చని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ ఆక్వా ఎగుమతులు, ఆక్వా రంగంలో సవాళ్ల గురించి వివరించారు. తెలంగాణలో చేపల పెంపకం ప్రాముఖ్యం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఉద్దేశం, నిర్దేశిత లక్ష్యం గురించి తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త గణేశ్ ఓవర్ ఫిషింగ్, ఆశ్రయాల క్షీణత, అక్రమ పద్ధతిలో చేపలు పట్టడం, పర్యావరణ కాలుష్యం మూలంగా కలిగే నష్టాల గురించి వివరించారు. కాగా, ధర్మసాగర్ మండలం మలక్‌పల్లికి చెందిన రైతు కుమారస్వామి జెల్ల చేపలు పెంచగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, సౌమ్య, గణేశ్, రాజు, శశాంక్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ ఉద్యమ రత్న' పురస్కారానికి హరీశ్‌రావు ఎంపిక


మంత్రి హరీశ్‌రావుకు ఎంపిక పత్రం అందజేస్తున్న అమరేష్

కమలాపూర్: 'తెలంగాణ ఉద్యమ రత్న 2023–24' పురస్కారానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్ రావును ఎంపిక చేసినట్లు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్‌ఆర్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ రామానుజన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకులకు పార్టీలకతీతంగా తెలంగాణ ఉద్యమ రత్న అవార్డు ఇవ్వాలని సంకల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉద్యమ నాయకుడు, మంత్రి హరీశ్‌రావును ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించే ఎస్‌ఆర్‌ఎఫ్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి హరీశ్‌రావుకు పురస్కారం అందజేస్తామని అమరేష్ తెలిపారు.

రైతుల వివరాలు నమోదు చేయాలి

కమలాపూర్: కొనుగోలు కేంద్రాల్లో రోజూ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఆదేశించారు. కమలాపూర్‌లో ఐకేపీ, గూడూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించి కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ వసంతలక్ష్మి, డీఎం మహేందర్, డీపీఎం ప్రకాశ్, డీటీ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సీఈఓ చోటేమియా, ఐకేపీ సీసీ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.


గూడూరులో కొనుగోళ్ల ప్రక్రియ తెలుసుకుంటున్న అనిల్‌కుమార్

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు మేలు


స్టాళ్లను సందర్శిస్తున్న ఉమారెడ్డి, స్వర్ణలత, కేవీకే, వ్యవసాయ అధికారులు

మహబూబాబాద్ రూరల్: రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి లాభాలు పొందాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు ఆర్.ఉమా రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ సంచాలకులు ఐ.స్వర్ణలత అన్నారు. జాతీయ ఆహారభద్రత పథకం వారి ఆర్థిక సౌజన్యంతో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేలికపాటి (తక్కువ సారవంతమైన) భూముల్లో పత్తిని సాగు చేసే రైతులందరూ అధిక సాంద్రత పద్ధతిని పాటించి లాభాలు గడించాలని సూచించారు. ఈ ప్రాజెక్టుపై మానుకోట జిల్లాలో 208 ఎకరాల్లో క్షేత్ర ప్రదర్శనలు చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో ఈ సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. పత్తి ప్రధాన శాస్త్రవేత్త జి.వీరన్న మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే నవంబర్ చివరికల్లా పంటను తొలగించి రెండో పంట వేసుకోవచ్చన్నారు. దీంతో గులాబీ రంగు పురుగు ఉధృతిని అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మాలతి, జిల్లా వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ, వరంగల్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.వెంకన్న, జి.పద్మజ, బి.మాధవి, జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.భాస్కర్, ప్రశాంత్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిశోర్ కుమార్, డాక్టర్ ఇ.రాంబాబు, బి.క్రాంతికుమార్, డి.ఉషశ్రీ, కాటన్ ప్రాజెక్ట్ వైపీలు, కేవీకే సిబ్బంది, 620 మంది రైతులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన 18 స్టాళ్లను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.